క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నివారణ



అల్లూరులో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నందికొట్కూరు రూరల్ : బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధిని నివారించవచ్చని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ వైద్యురాలు తులసీరాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. ఆమె మాట్లాడుతూ 60ఏళ్లు పైబడిన వారితో పాటు క్షయ వ్యాధి సోకిన ప్రతి ఒక్కరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమం ప్రతి గురువారం మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సీహెచ్‌ఓ సుజాత,హెల్త్ ఎడ్యుకేటర్ ప్రభాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు మహబూబ్ బాషా, రజియా పాల్గొన్నారు.

విధులకు హాజరైన ఉద్యోగులు



విధుల్లో ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: 'సాక్షి' దిన పత్రికలో 'ఒక్కరుంటే ఒట్టు' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, జూనియర్ అసిస్టెంటు, వీఆర్వోలు, అసిస్టెంటు మండల సర్వేయర్ విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సెలవుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అధికారులు విధులకు హాజరవ్వటంతో పలురకాల పనులపై వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకున్నారు.

ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి



ప్రభుత్వ వైద్యశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

నందికొట్కూరు: ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు ప్రజలు అలవర్చుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు, జిల్లా ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ రోగాలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని చెప్పారు. శారీరక వ్యాయామంతో బీపీని నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు. డాక్టర్లు శ్వేత, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ భర్త మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామ సర్పంచ్ మంగమ్మబాయి భర్త హనుమంతునాయక్(52) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు సర్పంచ్‌లు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలీశ్వరరెడ్డి, దరగయ్య, రాజశేఖర్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

నంద్యాల(అర్బన్): ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో నాణ్యమైన జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు రైతులకు అందజేయాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. జీలుగ, పిల్లిపెసర విత్తనాలను సరఫరా చేసే బాలాజీ సీడ్స్, హరిత అగ్రోటెక్ ప్రాసెసింగ్ ప్లాంట్లను శుక్రవారం ఆయన ఏఓ ప్రసాదరావుతో కలిసి తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ నంద్యాల డివిజన్‌లోని మండలాలకు 1,377 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయని, మరో 1,050 క్వింటాళ్లకు అనుమతులు కోరామని చెప్పారు. రైతులకు 50శాతం సబ్సిడీపై గరిష్ఠంగా ఐదు ఎకరాలకు 50 కేజీలు అందజేస్తామన్నారు. అవసరమైన రైతులు ఆర్‌బీకేలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.



సంగమేశ్వరాలయానికి గొడుగు పట్టినట్లు ఇంద్రధనస్సు



సంగమేశ్వరం క్షేత్రంలో వర్షం కురుస్తున్న దృశ్యం



మోస్తరు వర్షం

జూపాడుబంగ్లా: మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసింది. మే మాసంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైందని ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. మండలంలో ఈ నెల సాధారణ వర్షపాతం 28.5 మి.మీ. కాగా ఇప్పటికే 73.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. నందికొట్కూరు మండలంలో 29.4 మి.మీ.కు గాను 57.0 మి.మీ. వర్షం కురిసింది. పాములపాడు మండలంలో 34.0ఎం.ఎం గాను 91.4ఎం.ఎం వర్షపాతం నమోదైంది. మిడుతూరు మండలంలో 46.9 ఎం.ఎం కుగాను 59.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. కొత్తపల్లిలో 33.2 ఎం.ఎం కుగాను 48.6ఎం.ఎం వర్షం కురిసింది. పగిడ్యాల మండలంలో 39.3ఎం.ఎం కుగాను 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు. వారం రోజుల నుంచి వరుసగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో పొలాలు పదునెక్కాయి. దీంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు పొలాల్లో సేద్యం చేస్తున్నారు.

కొత్తపల్లి: మండలంలో రెండు రోజుల నుంచి గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బావాపురం, నందికుంట, దుద్యాల, బండినాయుని పాలెం, పాలెంచెరువు, గువ్వలకుంట్ల, జి.వీరాపురం, గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో వర్షం కురిసింది. దీంతో పొలాలు దుక్కులకు అనువుగా మారతాయని రైతులు పేర్కొంటున్నారు. సంగమేశ్వరంలో వర్షం పడటంతో పరిసరాలు పచ్చదనం పులుముకున్నాయి. వేసవి సెలవులు కావడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తున్నారు.



మహానందిలో మబ్బులు కమ్మిన ఆకాశం

కుండపోత వర్షం

మహానంది: మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. భారీ శబ్దాలతో వచ్చిన ఉరుములకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మహానంది ఆలయంలో ప్రతి శుక్రవారం పల్లకీసేవ జరగాల్సి ఉండగా వర్షం రాకతో వాయిదా వేశారు. మహానంది మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



జూపాడుబంగ్లాలో కేజీరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పొలాల్లో వర్షపునీరు నిలిచింది. బుధ, గురువారం రెండు రోజులపాటు నల్లమల అటవీ ప్రాంతంలోని వెంకటాపురం, సిద్ధాపురం, అమలాపురం, క్రిష్ణాపురం, పెద్ద అనంతపురం, సిద్ధపల్లి, ముష్టపల్లి, బాపునంతపురం, నల్లకాల్వ, కరివేన గ్రామాల్లో వర్షం కురవడంతోపాటు పొలాల్లో నీరు చేరింది. దుక్కులు దున్నేందుకు ఎంతగానో అనువుగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా వర్షపు చుక్క లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మూడు రోజులుగా వర్షాలు పడడంతో పట్టణ, గ్రామీణప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు రోజులపాటు రాయలసీమ ప్రాంతంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



ఆత్మకూరు బస్టాండ్‌లో..

అంకాలమ్మకు విశేష పూజలు



నిమ్మకాలయ అలంకరణలో అంకాలమ్మ

శ్రీశైలం: మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని పరిరక్షించే అంకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి వివిధ రకాల పుష్పాలు, నిమ్మకాయలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

ఆత్మకూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరికి ముందు పచ్చిరొట్ట సాగు చేసుకుంటే నేల సారవంతం అవుతుందన్నారు. రైతులు పూర్తిగా రసాయన ఎరువులపై ఆధారపడితే నేలసారం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో నేలకు సత్తువ లభించడమే కాకుండా రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని సూచించారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం ఆధార్‌కార్డు తీసుకెళ్లి పొందవచ్చన్నారు.

అందుబాటులో జీలుగలు

పాములపాడు: రైతులకు సబ్సిడీపై జీలుగలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జీలుగలు 50 శాతం రాయితీతో కిలో రూ.44 చొప్పున రైతులకు అందజేస్తామని చెప్పారు. కావలసిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం వంద క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లిపెసర విత్తనాలు త్వరలో రానున్నాయన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

- మృతి చెందిన సీసీ కుటుంబానికి రూ.3.58లక్షల చెక్కుఅందజేత



మనోహర్ భార్య ఉషారాణికి చెక్కు అందజేస్తున్న పీడీలు శ్రీధర్‌రెడ్డి, సలీం బాషా

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న డీఆర్‌డీఏ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని నంద్యాల, కర్నూలు జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు వైబి.శ్రీధర్‌రెడ్డి, సలీంబాషా తెలిపారు. మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ (43) పాములపాడు వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది మార్చి 23న గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న డీఆర్‌డీఏ పీడీ, ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం గ్రామానికి చేరుకొని రూ.3,58,500 చెక్కును మృతుడి భార్య ఉషారాణికి అందజేశారు. పీడీలు మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అనారోగ్యంతో బాధపడే ఉద్యోగులు ఎవరైనా ఉంటే వాటిని తమ దృష్టికి తెస్తే తమవంతు సహాయ, సహకారాలు అందించి ఆదుకుంటామని చెప్పారు. డీపీఎం దానం, ఏరియా కోఆర్డినేటర్లు దేగలయ్య, పుల్లయ్య, ఏపీఎం లు అంబమ్మ, అనురాధ, అడ్డాకుల శ్రీనివాసులు, ఎల్లయ్య, సురేష్, ఉమ్మడి జిల్లాల యూనియన్ లీడర్లు వి.రవి, ఎం.రవి, బి.కృష్ణుడు, వి.కృష్ణారెడ్డి, ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అదనంగా 50 రోజుల పని

- ఐటీడీఏ శ్రీశైలం అధికారి రవీంద్రారెడ్డి



వైకేపీ, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ శ్రీశైలం అధికారి రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: స్థానిక ఐటీడీఏ సబ్ ఆఫీసులో శుక్రవారం ఉపాధిహామీ, వైకేపీ సిబ్బందితో ఐటీడీఏ శ్రీశైలం అధికారి బి.రవీంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఆదేశించారు. వారికి అదనంగా 50 పని దినాలు కూడా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రతి చెంచు కుటుంబం కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆ మేరకు ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వైకేపీ సిబ్బంది, ఏపీఎం, సీసీలు ప్రధానమంత్రి వన్ యోజన కేంద్రాల ఆధ్వర్యంలో అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మార్కెటింగ్ చేయాలని, దీనికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. దీని వల్ల ప్రతి గ్రామంలో 10 నుంచి 20 మంది గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కావాల్సిన నిధులను సమకూరుస్తామని తెలిపారు. ప్రతి పీఎంవీడీవీకే నుంచి అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. వాటి ద్వారా గిరిజనులకు ఉపాధి కల్పించాలన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తపోటు దినోత్సవం



రోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు



హుసేనాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ''తరచుగా బీపీ చెక్ చేయించుకుంటాము, క్రమం తప్పకుండా మందులు వాడుతామని'' శుక్రవారం రోగులతో వైద్యాధికారులు ప్రతిజ్ఞ చేయించారు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. తద్వారా గుండె సంబంధిత వ్యాధులు నియంత్రణలో ఉంటాయని తెలిపారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం పదిలం

ఓర్వకల్లు: మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి దూరమై రక్తపోటు బారిన పడకుండా ఉండొచ్చని వైద్యురాలు రేఖ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య జీవనం సొంతం అవుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా బీపీ చెక్ చేసుకోవాలని సూచించారు. రక్తపోటు ఉంటే మందులు వాడాలన్నారు. బీపీ నియంత్రణలో ఉంటే గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని చెప్పారు. ఎంపీహెచ్ఈఓ రాబర్ట్, పీహెచ్ఎన్ రమణమ్మ, ఎంపీహెచ్ఎస్‌లు శిలువజ్యోతి, ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూంల భద్రతపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై చర్చించారు.

బాలుడిని తీసుకెళ్లండి



శిశు గృహంలో ఉన్న చిన్నారి

నంద్యాల(అర్బన్): ఈనెల 12న డోన్ రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వదలిపోయిన ఏడాది చిన్నారికి సంబంధించిన వారు ఆధారాలు చూపి తీసుకెళ్లవచ్చని కర్నూలు జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు రైల్వే గేటు సమీపంలో వదలి వెళ్లారని, డోన్‌కు చెందిన ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేసి బాలుడిని ఈనెల 15న స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కర్నూలులోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శిశు గృహంలో ఉంచామన్నారు. ఎవరూ రాకపోతే 30రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు అనాథగా తీర్మానించి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ వారి సూచనల మేరకు దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

గోస్పాడు: ఉపాధి పనులకు వెళ్లిన ఎద్దుల పెద్దపుల్లయ్య (70) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని ఎస్.కూలూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఉపాధి సిబ్బంది తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పెద్ద పుల్లయ్య రోజు మాదిరిగా ఉపాధి హామీ పనికి వెళ్లాడు. కొంత సేపు పని చేసిన అనంతరం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి కిందపడిపోవడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీఓ నాగఅనసూయ, ఏపీఓ నాగజ్యోతి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీసు బందోబస్తు మధ్య మాన్యం వేలం



మాన్యం కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

పగిడ్యాల: స్థానిక చెన్నకేశవాలయంలో శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య భూముల కౌలుకు వేలం పాటలను ఈఓ రామలింగారెడ్డి నిర్వహించారు. మొత్తం 36 మంది రైతులు రూ.5వేల చొప్పున ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. శ్రీచెన్నకేశవ, ఆంజనేయస్వామి దేవాలయాలకు సంబంధించిన 60 ఎకరాల భూముల కౌలుకు వేలం పాటలు నిర్వహించారు. గతేడాది రూ.8,34,000కు దక్కించుకొన్నారు. వీరభద్రస్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాల భూములు కౌలుకు వేలం నిర్వహించగా రూ.3,14,000లకు కౌలుకు దక్కించుకొన్నారు. ఈ ఏడాది చెన్నకేశవ, ఆంజనేయస్వామి భూములకు రూ.2,10,000 ఆదాయం రాగా వీరభద్రస్వామి ఆలయ భూములకు రూ. 12,000 నష్టం వాటిల్లినట్లు ఈఓ తెలిపారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐలు జయశేఖర్, లక్ష్మినారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, నాగార్జున, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది రామసుబ్బయ్య, బాలుడు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీశైలం: ఆర్థిక ఇబ్బందులతో గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి(34) అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఆయన స్వస్థలం జరహాపురంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. కాగా ఈయన గతంలో కర్నూలు జిల్లాలోని పలు స్టేషన్‌లలో కానిస్టేబుల్‌గా పని చేశారు. గత ఏడాది జూలై నుంచి శ్రీశైలం వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. స్టేషన్‌లోని రెస్ట్ రూమ్స్‌లోనే ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వెపన్స్ రూములోకి వెళ్లి గన్ తెచ్చుకున్న శంకర్‌రెడ్డి తన కుడి కణత వద్ద కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనకు వివాహం కాలేదు.

యర్రగుంట్లలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

మహానంది: బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో అతిసారం ప్రబలడంతో శుక్రవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలువల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్, బోర్ల నీటిని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో బ్యాక్టీరియోలాజికల్ అనాలిసిస్ ఆఫ్ వాటర్ పరీక్షలు చేయగా నీరు సురక్షితంగానే ఉందని నివేదికలు ఇచ్చారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బండిఆత్మకూరు వైద్యాధికారిణి భావనారెడ్డి, ఎంపీడీఓ విజయరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దాడి కేసులో నిందితులకు రిమాండ్



నిందితుల అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: మాజీ మంత్రి టీడీపీ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అనుచరుడు నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ..గతేడాది లోకేశ్ పాదయాత్ర సందర్భంగా నంద్యాలలో అఖిలప్రియ, టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా అఖిలప్రియ వెంట ఉన్న నిఖిల్ ఏవీ సుబ్బారెడ్డిపై దాడిచేసి గాయపరిచాడు. ఇది మనుసులో పెట్టుకున్న ఏవీ సుబ్బారెడ్డి ఎలాగైనా నిఖిల్‌ను మట్టుబెట్టాలని భావించాడు. అదును కోసం ఎదురు చూస్తూ ఉండగా ఈ నెల 14న అర్ధరాత్రి నిఖిల్, మరో వ్యక్తి అఖిలప్రియ ఇంటిముందు పహారా కాస్తున్నట్లు తెలుసుకొని నిఖిల్‌ను హత్య చేయాని నిర్ణయించుకున్నారు. నూలి అశోక్, రవి కారులో వచ్చి రోడ్డుపై నిలబడి ఉన్న నిఖిల్‌ను ఢీకొట్టారు. అనంతరం కారులోనుంచి దిగి కత్తులతో నిఖిల్‌పై దాడిచేయగా, వారి నుంచి తప్పించుకుని అఖిలప్రియ ఇంట్లోకి పరిగెత్తాడు. దీంతో దుండగులు అక్కడి నుంచి వచ్చిన కారులోనే పారిపోయారు. ఈ సంఘటనపై గాయపడ్డ నిఖిల్‌తో పాటు ప్రత్యక్ష సాక్షి అయిన చాకలి మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో కొందరు నంద్యాల రోడ్డులో ఉన్నారనే సమాచారం మేరకు డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ రమేష్‌బాబు సిబ్బందితో వెళ్లి పీఎస్‌ఆర్ గోడౌన్ సమీపంలోనున్న రామలక్ష్మి కొట్టాలకు చెందిన నూలి అశోక్, గజ్జలన్న వీధికి చెందిన రవిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా ఏవీ సుబ్బారెడ్డి ప్రోద్బలంతోనే హత్య చేసేందుకు ప్రయత్నించామని ఒప్పుకున్నారు. దీంతో ఏ-1గా నంద్యాల శివాలయం వీధికి చెందిన చంద్రకుమార్ , ఏ-2 గా టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, ఏ-3గా నంద్యాల టౌన్‌కు చెందిన మాలిక్‌బాషా, ఏ-4గా ఆళ్లగడ్డ రామలక్ష్మి కొట్టాలకు చెందిన అశోక్, ఏ-5గా గజ్జలన్న వీధికి చెందిన రవి, ఏ-6గా చిత్తిరేనిపల్లె కు చెందిన తప్పెట నరసింహ, ఏ-7గా చంటిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. త్వరలో మిగిలిన నిందితులందరినీ అరెస్ట్ చేస్తామని చెప్పారు.

పంట అవశేషాలు కాల్చొద్దు

నంద్యాల(సెంట్రల్): పంట అవశేషాలను కాల్చరాదని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ... రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలు పూర్తయిన తరువాత వాటి అవశేషాలను కాల్చడం వల్ల భూమిపై పొరల్లో ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు.